

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### చైల్డ్ ప్లే

**"వీడి మొహానికి** ఇతిహాస్ అనే పేరు అవసరమా?"

శ్రీమతి శ్రీపతి, శ్రీపతితో గుసగుసగా చెప్పింది.

"బాగా చెప్పావ్" ఆయన భార్యని మెచ్చుకున్నాడు. సికింద్రాబాద్‌లో రైలెక్కినప్పటినించి వాళ్ళు ఆ అల్లరిని భరిస్తున్నారు. అర్జెంట్ పని మీద నెల్లూరు వెళ్ళాల్సి వచ్చి కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. దురదృష్టవశాత్తూ వాళ్ళకి ఆ ఏసి చైర్‌కార్ మధ్యలో ఉండే టేబుల్ ముందు సీట్లు వచ్చాయి. మొదట దాన్ని చూసి ఆనందపడ్డారు. న్యూస్ పేపర్, హేండ్‌బేగ్, వాటర్‌బాటిల్‌లాంటివి ఆ టేబుల్ మీద పెట్టి ఎదురు సీట్లలో కనబడే వాళ్ళవంక సరదాగా చూసారు.

రైలు బయలుదేరడానికి ఐదునిమిషాల ముందు ఓ కుటుంబం హడావిడిగా రైలెక్కింది. ముప్పైలలో ఉన్న భార్యా భర్తలు, ఐదేళ్ళ కొడుకు, ఏడాదిలోపు కూతురు.

సీట్ నంబర్లు చూసుకుని భర్త చెప్పాడు.

"టేబుల్ ముందు సీట్లు. బెస్ట్, పాలసీసాలు, నీళ్ళసీసాలు పెట్టుకోవచ్చు."

ముద్దుగా ఉన్న పిల్లలని చూసి శ్రీపతి దంపతులు మొదట ముచ్చటపడ్డారు. మూడో నిమిషంలో ఆ పిల్లవాడి అల్లరికి భయపడ్డారు. వాడు ఆ టేబుల్ వంక ఓసారి చూసి దానిమీద చేతిని అర్ధచంద్రాకారంగా తిప్పాడు. శ్రీపతి సామానంతా చిందరవందరగా కిందపడిపోయింది. వాడు విజయగర్వంతో దానిమీద ఎక్కినుంచుని డాన్స్ మొదలుపెట్టాడు. తల్లి వాడిని లాగి కూర్చోపెట్టి నెత్తిమీద ఠక్కున ఒక మొట్టికాయ వేసి అరిచింది.

"రైల్లో అల్లరిచేస్తే చంపేస్తానని చెప్పానా?"

వాడు తలమీద తడుముకుంటూ 'బే'మని ఏడవసాగాడు. రైలు బయలుదేరింది. వాడు ఏడుపు ఆపి కుతూహలంగా కిటికీలోంచి చూసాడు. అదీ అరనిముషమే. తర్వాత తల్లి ఒడిలో ఉన్న చెల్లెలి పిలక పట్టుకుని లాగాడు. ఆ పిల్ల రాగం అందుకుంది.

తల్లివాడి వీపుమీద చెళ్ళుమని ఓ దెబ్బ వేసింది. వాడు మళ్ళీ ఏడుపు లంకించుకున్నాడు. అత్యంత సహనవంతుడిలా కనిపించే తండ్రి బేగ్‌లోంచి చాక్లెట్లు తీసేసరికి పిల్లలిద్దరూ ఏడుపు ఆపి తినడం మొదలుపెట్టారు.

ఆ గోలకి హడలిపోయిన శ్రీమతి శ్రీపతి అడిగింది.

"ఎందాకా అమ్మాయ్?"

"తిరుపతి అండీ, మా తమ్ముడికి హటాత్తుగా పెళ్ళి కుదిరింది. రాత్రి రైళ్ళలో టిక్కెట్లు దొరకలేదు. అందుకని పగలు ప్రయాణం చేయాల్సివస్తోంది. సారీ. మావాడు కొంచెం అల్లరి" ఆమె చెప్పింది.

'కొంచెం అల్లరా తల్లీ!' అని మనసులో పళ్ళునూరుకున్న మిసెస్ శ్రీపతి సానుభూతిగా చెప్పింది.

"తిరుపతి చేరేసరికి రాత్రి తొమ్మిది దాటుతుంది. పిల్లలతో చాలా అవస్థపడాలి మీరు."

భర్త పిల్లల్ని చేతులు కడగటానికి తీసుకెళ్ళాడు. ఆమె ముందుకు వంగి చెప్పింది.

"పిల్లాడ్ని మీరు చూసుకోండి. పిల్లని తీసుకెళ్తా అని మా అత్తగారితో చెప్పానండి. ఆవిడ ఒప్పుకోలేదు. మీరు ఆఫీసులకి వెళ్ళినప్పుడు పగలంతా చూస్తున్నందుకే గుండెదడ వచ్చింది. ఇక రాత్రిపూట కూడా వీడిని చూడటం నావల్లకాదు. కావాలంటే, పిల్లని చూసుకుంటా అన్నారండీ. మా అమ్మేమో పిల్లని తీసుకురా. పుట్టువెంట్రుకలు తీయిద్దాం అంది.." ఈలోగా భర్త రావడంతో ఆమె మాటలు ఆపేసింది.

"నీ పేరేంటి?" శ్రీపతి ఆ పిల్లవాడ్ని అడిగాడు. వాడు ఆయన్ని ఎగాదిగా చూసి, తళతళలాడే ఆయన బట్టతల మీద ఓ చరుపు చరిచి చెప్పాడు.

"ఇతిహాస్."

మళ్ళీ వాడి మీద దెబ్బపడింది.

"సారీ అండీ" వాడి తల్లి అవమానంగా చెప్పింది.

రైలు ఊరిపొలిమేరలు దాటాక శ్రీమతి శ్రీపతి బేగ్‌లోంచి రెండు టిఫిన్ బాక్స్‌లు తీసి ఒకటి ఆయనకిచ్చి ఒకటి తను తీసుకుంది. ఇద్దరూ వాటి మూతలు తీసి ఇడ్లీలు తినసాగారు.

ఇతిహాస్ శ్రీపతి డబ్బాలో మొహం పెట్టి చూసి

"ఛీ! ఇడ్లీలా." అని తలతిప్పుకున్నాడు.

ఆయన పేపర్ చదువుకుంటూ నిదానంగా తింటుంటే ఆయన చేతిమీద ఒక దెబ్బవేసి అరిచాడు.

"ఎంతసేపు తినడం?"

ఆ అదటుకి శ్రీపతి చేతిలోని బాక్స్ కిందపడి పోయి ఇడ్లీలు నేలమీదకి దొర్లాయి.

మళ్ళీ వాడి నెత్తిన ఒక మొట్టికాయ.

మిసెస్ శ్రీపతి వాడిని మింగేసేలా చూస్తూ తన బాక్స్‌ని భర్తకి అందించి చెప్పింది.

"ఇది తినండి. షుగర్ బిళ్ళవేసుకోవాలి మీరు." ఇంతలో టి.సి. వచ్చాడు. శ్రీపతి అతనికి టిక్కెట్లు చూపించి అడిగాడు.

"ఎక్కడైనా రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయా? మారతాం."

"లేదండి. రైలు ఫుల్." టిసి సానుభూతిగా చెప్పాడు.

"నేను వెళ్ళి చేతులు కడుక్కొచ్చి టిఫిన్ పెడతాను. దీన్ని తీసుకోండి" ఆమె భర్తకి పాపని అందించింది. ఆ పిల్ల తల్లివైపు చేతులు చాపి ఏడవడం మొదలుపెట్టింది. తండ్రి లేచి పిల్లతో బయటకి వెళ్ళాడు. ఆమెకూడా బాత్‌రూం వైపు వెళ్తూ కొడుకుతో కఠినంగా చెప్పింది.

"నేను వచ్చేలోపల ఇక్కడినించి కదిలావా? కాళ్ళు విరగ్గొడతా."

వాడు ఓ ఇరవై క్షణాలు కుదురుగా కూర్చున్నాడు. తర్వాత ముందుకి వంగి శ్రీపతితో గుసగుసగా చెప్పాడు.

"నీకోటి చెప్పనా?"

"ఏమిటి?" ఆయన చిరాగ్గా అడిగాడు.

"వీళ్ళు నన్ను హాస్పిటల్‌నించి తెచ్చుకున్నారు. ఆ రెండు పిలకల దెయ్యం ఉందే అది మాత్రం మా అమ్మ పొట్టలోంచి వచ్చింది. అది పుట్టినప్పటినించీ నాకు ఒకటే దెబ్బలు" వాడు విచారంగా చెప్పాడు.

శ్రీపతి దంపతులు నిర్ఘాంతపోయారు.

"మా నాయనమ్మ దగ్గర ఒక కర్ర ఉంటుంది. దాంతో కొడుతుంది." వాడు మరింత విషాదంగా చెప్పాడు.

"అయ్యో!" శ్రీమతి శ్రీపతి నొచ్చుకుంది.

"రెండు నిమిషాలు కదలకుండా కూర్చో బ్రేక్‌ఫాస్ట్ పెడతా" తల్లి చేతులు కడుక్కొచ్చి చెప్పింది.

"ఏంటీ మళ్ళీ ఇడ్లీయేనా? యాక్." వాడు మొహం వికారంగా పెట్టాడు.

ఠక్కున నెత్తిమీద మొట్టికాయ పడింది.

"నోర్మూసుకుని తిను. తర్వాత పడుకో. పొద్దున్నే లేచాంగా. నీ అల్లరికి తలపగిలిపోతోంది" ఆమె కసిరింది.

"ఇడ్లీ వద్దన్నాడే అనుకోండి. మరీ తల చిల్లుపడేట్లు మొట్టికాయ వేయాలా?" మిసెస్ శ్రీపతి భర్తతో గుసగుసగా చెప్పింది.

నిజమే అన్నట్లుగా ఆయన తలాడించాడు.

పిల్ల బుద్ధిగా తల్లి ఒడిలో కూర్చుని ఇడ్లీ తింటోంది.

"నాకూ నోట్లో పెట్టు." వాడు కోరాడు.

"గుర్రంలాగా ఉన్నావు. తినలేవు?" అరిచింది తల్లి.

"అదిలేదూ ఎద్దులాగా?" పిలక పట్టుకుని లాగాడు.

పిల్ల ఏడుపు లంకించుకుంది. తల్లి ఎంగిలిచేత్తో వాడివీపు మీద చెళ్ళున ఒక దెబ్బవేసింది. వాడు టిఫిన్ బాక్స్ మూతని విసిరికొట్టాడు. అది వెళ్ళి శ్రీమతి శ్రీపతి భుజానికి తగిలి కిందపడింది. వాడికి మరో రెండు దెబ్బలు తగిలాయి.

"పోన్లెమ్మా. చిన్నబిడ్డ. కొట్టవాకు." శ్రీమతి శ్రీపతి భుజం తడుముకుంటూ చెప్పింది.

"మీరే చూస్తున్నారు కదండీ. రైలెక్కినప్పటినించి ఒక్క నిమిషమైనా బుద్ధిగా ఉన్నాడా? వీడి అల్లరితో చచ్చిపోతున్నాం. స్కూల్‌నించి రోజూ కంప్లయింట్సే. వాళ్ళేదో ఫీజులకి కక్కుర్తిపడి భరిస్తున్నారు కానీ ఈ రాక్షసుడ్ని కంట్రోల్ చెయ్యడం ఆ దేవుడి తరం కూడాకాదు." ఆమె ముఖం కోపంతో ఎర్రబడింది.

"నువ్వే రాక్షసి. ఇదో రాక్షసి." ఇతిహాస్ చెల్లెలి చెంపమీద చెళ్ళుమని చరిచాడు.

తండ్రి వాడిని బయటకి లాక్కుపోయాడు. పదినిమిషాల తర్వాత వాడు రెండు ఫ్రూటీలతో వచ్చి చెల్లెలికి ఒకటి ఇచ్చి రెండోది తను తాగసాగాడు.

"ప్లీజ్. మన రిటన్ టిక్కెట్లు కేన్సిల్ చేసి, ఫ్లయిట్ టిక్కెట్స్ బుక్ చేయండి. వీడితో నావల్ల కాదు. ఎక్స్‌పెన్సివ్ అయినా పర్లేదు. ఓ నెల జీతం అనుకుంటా." ఆమె భర్తని కోరింది.

సహన స్వామాట్ బుద్ధిగా తల గుండ్రంగా తిప్పాడు.

"మరీ విడ్డూరం. పిల్లలన్నాక అల్లరి చేయరా?" శ్రీమతి శ్రీపతి భర్త చెవిలో గుసగుసలాడింది.

వాడు ఫ్రూటీని చివరిచుక్క దాకా పీల్చేసి, ఖాళీ కార్టన్‌ని శ్రీపతి బట్టతల మీదకి విసిరికొట్టాడు. మళ్ళీ వీపుమీద దెబ్బలు పడ్డాయి.

"చిన్నవెధవమ్మా. వాడికేం తెలుసు? కొట్టి చంపుతావా యేంటి?" మిసెస్ శ్రీపతి వాడిని తన దగ్గరకి లాక్కుని ఒళ్ళో కూర్చోబెట్టుకుంది. వాడు కూడా ఆవిడ చేతులకి ఉన్న రంగురంగుల గాజులని చూస్తూ ఓ అరనిమిషం ప్రశాంతంగా కూర్చున్నాడు.

"మీ చెల్లెలి పేరేంటి?" ఆవిడ ముద్దుగా అడిగింది.

"నీకెందుకే ముసలీ." వాడు ఆవిడ మొహానికి ఉన్న కళ్ళజోడు లాగబోయాడు.

ఆవిడ భయపడి వాడిని ఒళ్ళోంచి దించేసింది.

పిల్లలిద్దరూ నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నారు. తల్లితండ్రులు కూడా విజయవాడదాకా గాఢనిద్రపోయారు. కంపార్ట్‌మెంట్ అంతా నిశ్శబ్ధంగా స్వర్గంలా అనిపించింది శ్రీపతి దంపతులకి.

"చూస్తే చిన్నవాళ్ళేకదా. పిల్లలు పుట్టేదాకా ఆగకుండా వీడిని ఎందుకు పెంచుకున్నట్లు?" శ్రీమతి శ్రీపతి సందేహంగా అడిగింది.

"వీడికి ఐదేళ్ళుంటాయ్. ఆ పిల్లకి ఏడాదిలోపు. అంటే వీడిని పెంచుకున్న నాలుగేళ్ళకి కానీ పుట్టలేదు. పెళ్ళయిన ఎన్నేళ్ళకి పెంపకానికి తీసుకున్నారో!" ఆయన ఆలోచనగా చెప్పాడు.

"మీరు చెప్పిందేమిటో అర్థంకాలా" ఆవిడ చెప్పింది.

"నష్టంలేదు. నన్ను పేపర్ చదువుకోనీ" ఆయన పేపర్లోకి తలదూర్చాడు.

హటాత్తుగా పేపర్ని చీల్చుకుని ఓ చిన్న పిడికిలి వేగంగా వచ్చి శ్రీపతిని ముక్కుమీద గుద్దింది.

'అబ్బా' ఆయన విలవిల్లాడాడు.

నిద్రలో ఉన్న తల్లి ఉలిక్కిపడి లేచి పరిస్థితి అర్థం చేసుకుని ఎర్రబడ్డ మొహంతో వాడిని చూసి భర్తతో చెప్పింది.

"కాస్త వీడిని చూస్తుండచ్చుగా? చస్తున్నాను. వెధవగోల." అతను వాడిని తీసుకెళ్ళి ఓ బస్తాడు చిప్స్, కూల్‌డ్రింక్స్‌తో వచ్చాడు. పిల్లలిద్దరూ తినడంలో నిమగ్నమయ్యారు.

రైలు ఒంగోలు దాటాక శ్రీమతి శ్రీపతి ఆమెతో మృదువుగా చెప్పింది.

"ఏ రౌడీ వెధవకి పుట్టాడోకాని పిల్లవాడికి అన్నీ రౌడీ బుద్ధులే. ఐనా భరిస్తున్నారు. మీది చాలా మంచి మనసు. కాకపోతే మరీ అంతగా కొడితే పిల్లాడు తట్టుకోలేడమ్మా. పెద్దయ్యేకొద్దీ అల్లరి తగ్గుతుందిలే."

ఆమె అయోమయంగా చూసింది. సహనస్వామాట్ మొహంలో మొదటిసారి కోపం తొంగిచూసింది.

"నా రౌడీ చేష్టలు ఏం చూసారు మీరు?" అడిగాడు.

"నిన్నుకాదు బాబు. ఇతిహాస్ తండ్రి గురించి చెప్తున్నా."

ఆవిడ అనునయంగా చెప్పింది.

"ఇతిహాస్ తండ్రిని నేనే."

ఆవిడ తెల్లమొహం వేసింది.

"వాడు తనని హాస్పిటల్ నించి తెచ్చుకున్నారని...." శ్రీపతి సర్దిచెప్పబోయాడు.

వాడి వీపుమీద రెండు దెబ్బలు పడ్డాయి. "దరిద్రుడా! కనిపించిన అందరికీ అట్లా చెప్పద్దన్నానా?... మా అత్తగారినవాలి అసలు. వీడు పిల్లలెలా పుడతారు నాయనమ్మా అని సతాయిస్తుంటే, హాస్పిటల్ నించి తెచ్చుకుని పెంచుకుంటారని చెప్పారట. ఇది పుట్టినప్పుడు నా పొట్ట ఎత్తుగా ఉంటే, అందులో చెల్లెలుందని చెప్పారంట. దాంతో ప్రతి ఒక్కరికీ ఇదే మాట చెప్తున్నాడు..." ఆమె ఆవేశంగా చెప్పింది.

రైలు నెల్లూరులో ఆగింది. వాళ్ళకి క్షమాపణలు చెప్పి శ్రీపతి దంపతులు రైలు దిగారు.

"పిశాచం పిల్లాడు. నా డెబ్బై ఏళ్ళ జీవితంలో ఇంత అల్లరివాడిని చూడలేదు" శ్రీమతి శ్రీపతి కోపంగా చెప్పింది.

"వాడు చెప్పింది అబద్ధమేమో అని నాకు అనిపించింది. కానీ.." ఆయనేదో దీర్ఘాలు తీస్తూ చెప్పబోయాడు.

"చాల్లే ఊరుకోండి. వాడు చెప్పింది అబద్ధం అనుకుంటే మీ ముక్కుబద్దలైనప్పుడు రియాక్షన్ ఇంకోలా ఉండేది." శ్రీమతి శ్రీపతి భర్తని కసిరింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments